దాశరథి భవిష్యత్ తరాలకు స్ఫూర్తి

దాశరథి వర్ధంతి సందర్భంగా కేసీఆర్ నివాళి

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని నినదించిన తెలంగాణ కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సాగిన ఉద్యమంలో దాశరథి అందించిన పోరాట స్ఫూర్తి ఇమిడి ఉన్నదని పేర్కొన్నారు. దాశరథి కృషిని గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలన్న లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేశారు.

దాశరథికి దండేది?

చిన్నగూడూరు, నవంబర్ 5: నిజాం పాలకులను గడగడలాడించిన దాశరథి కృష్ణమాచార్యులను నేటి పాలకులు మరిచారు. మంగళవారం దాశరథి వర్ధంతి కాగా, ఆయన స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో ఉన్న విగ్రహానికి కనీసం పూలదండ కూడా వేయలేదు. ప్రభుత్వం ఆయన పేరిట అవార్డులు కూడా ఇస్తున్నా ప్రజాప్రతినిధులు కనీసం స్మరించుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

మద్దతు ధర ప్రకటనలకే పరిమితం

- సర్కారు తీరుతో పత్తి రైతులకు తీవ్రనష్టాలు
- క్వింటా పత్తికి రూ.వెయ్యి బోనస్ ఇవ్వాలి: తాతా, సంద్ర
- బీఆర్ఎస్ నాయకుల ఎదుట దూది రైతుల కంటతడి



ఖమ్మం ఏఎంసీలోని పత్తి యార్డులో విక్రయానికి తెచ్చిన పత్తిని పరిశీలిస్తూ రైతుల బాధలు వింటున్న ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ నేతలు

ఖమ్మం, నవంబర్ 5 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న పత్తికి మద్దతు ధర ప్రకటనలకే పరిమితమైందని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు విమర్శించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ తదితరులు మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్రయవిక్రయాలను పరిశీలించారు. పత్తి రైతులు బీఆర్ఎస్ నాయకులకు పంటను చూపించి బాధలు చెప్పుకునేందుకు బారులు తీరారు. కొందరు కంటతడి పెట్టారు. దాదాపుగా 40 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తిసాగు చేశానని, తీరా పంటను మార్కెట్‌కు తెస్తే క్వింటాకు రూ.6,500 మించి ధర పెట్టడం లేదని ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు తండాకు చెందిన మాళోత్ కాళిదాసు వాపోయాడు. రఘునాథపాలెం మండలం మంగ్యా తండాకు చెందిన యువరైతు బానోత్ రవి కూడా తన గోడు వెళ్లబోసుకున్నాడు. తాను 14 బస్తాల పంటను తెస్తే కనీసం పంటను చూసేందుకు ఒక్క వ్యాపారి కూడా రావడం లేదని కన్నీరుపెట్టుకున్నాడు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జిల్లాలో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. మద్దతు ధరల విషయంలో జిల్లాలోని ముగ్గురు మంత్రులు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. సీసీఐ కొర్రీలతో రైతుల పంట మొత్తం ప్రైవేటుకు వెళ్తున్నదని ఆరోపించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. పత్తి రైతులకు క్వింటాకు రూ.వెయ్యి చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి పెద్ద రైతు అయి ఉండి కూడా రైతుల బాధలను పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. అనంతరం జిల్లాలో పత్తి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు.

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాల కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

బోనస్ దేవుడెరుగు.. ధాన్యమే కొంటలేరు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

దేవరుప్పుల, నవంబర్ 5: సన్నాలకు రూ.500 బోనస్ దేవుడెరుగు, కనీసం ధాన్యం కొనుగోలు ప్రారంభించినా చాలని రైతులు అనుకుంటారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాలలోని కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించగా, రైతులు తమ గోడును వినిపించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఆర్భాటంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రెండు వారాలు గడుస్తున్నా నేటికీ కొనుగోలు జరగడం లేదని మండిపడ్డారు. రైతులు ఇప్పటికే రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలుపై నమ్మకాన్ని కోల్పోయారని, సన్నాలపై బోనస్ ఇస్తారనే నమ్మకం రైతులకు లేదని అన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి వారం రోజులు దాటుతున్నదని తెలిపారు. రైతులు సన్న ధాన్యాన్ని తీసుకొచ్చినా, సన్న ధాన్యమని నిర్ధారించే పరికరం లేక కొనడం లేదని నిర్వాహకులు చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేవరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సన్న వడ్లకు బోనస్, రుణ మాఫీ, రైతు భరోసా అమలయ్యే వరకు రైతుల పక్షాన నిలబడి కొట్లాడుతామని స్పష్టం చేశారు.

రోడ్డెక్కిన పత్తి రైతులు

నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం నీలంనగర్ వద్ద కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై పత్తి కొనుగోలు చేయాలని ట్రాక్టర్లు అడ్డంగా పెట్టి ఆందోళన చేస్తున్న రైతులు - పెద్దఅడిశర్లపల్లి

పత్తి యార్డు ఎదుట రైతు సంఘం ధర్నా



పత్తికి మద్దతు ధర ఇవ్వాలని సీపీఐ, రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి యార్డుకు తాళం వేసి మంగళవారం ధర్నా చేస్తున్న రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు హేమంతరావు,సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు అవునూరి మధు - ఖమ్మం వ్యవసాయం

పత్తి కొనుగోళ్లలో వేగం పెంచాలి

అధికారులకు తుమ్మల ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ) : పత్తి కొనుగోళ్లలో వేగం పెంచాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు.మంగళవారం పత్తి కొనుగోళ్లపై సెక్రటేరియట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఇప్పటి వరకు రూ. 82.44 కోట్ల విలువైన 11,255 టన్నుల పత్తిని 5,251 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్టు తెలిపారు. పత్తి కొనుగోళ్లను కలెక్టర్లు, మార్కెటింగ్ అధికారులు పర్యవేక్షించాలని, 8897281111 వాట్సాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను మార్కెటింగ్ శాఖ సంచాలకులు పరిశీలించి, తిరిగి ఫోన్ ద్వారా పరిష్కరించాలని ఆదేశించారు. మంగళవారం వరకు 188 ఫిర్యాదులు స్వీకరించి వాటిలో 157 పరిష్కరించినట్టు తెలిపారు.

విరబూసిన తెల్లబంగారం

ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది పత్తి దిగుబడి ఆశాజనకంగా ఉంది. వాతావరణం అనుకూలించడం, వర్షాలు సహకరించడంతో ఎకరాకు 10 క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చింది. పత్తి చేలు దూదితో కళకళలాడుతున్నాయి. మావల మండలంలోని బట్టి సావర్గాం సమీపంలోని చేనులో విరగబూసిన పత్తిని 'నమస్తే' క్లిక్ అనిపించింది. - ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ నాయకులు, రైతులు

ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై కన్నెర్ర

మధురానగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో

గంగాధర, నవంబర్ 5: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై అన్నదాతలు కన్నెర్రజేస్తున్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు, రైతులు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి గంగాధర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నా.. రైతుల నుంచి బస్తా ధాన్యాన్ని కొనలేదని విమర్శించారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు రూ.500 బోనస్ చెల్లించాలని కోరారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసే వరకు బీఆర్ఎస్ రైతులకు అండగా ఉంటుందని స్పష్టంచేశారు.

ధాన్యం ఎప్పుడు కొంటరు?

మొదటిపేజీ తరువాయి...

చూస్తామని చెప్పాయని వివరించారు. 30 ఏండ్లుగా పార్టీ కోసం పని చేస్తున్నామని, ఎన్నికల్లో తాము పార్టీ కోసం కష్టపడి పనిచేసి ఓట్లు అడిగామని చెప్పారు. ఇప్పుడు రైతుల సమస్యలపై ప్రజలు ప్రశ్నిస్తే ఏం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తాను గాంధీభవన్‌కు ఫోన్ చేసి ఈ విషయాలను మాట్లాడానని గుంటి మొగిలి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాల్సిందే

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ) : నిబంధనల మేరకు మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాల్సిందేనని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్లు సహకరించాలని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 150 లక్షల టన్నుల వరి దిగుబడి వచ్చిందని స్పష్టంచేశారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

సీఎమ్మార్ గడువు పెంపు

హైదరాబాద్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): నిరుడు వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి సీఎమ్మార్ గడువును కేంద్ర ప్రభుత్వం పొడగించింది. ఈ నెలాఖరు వరకు అవకాశం కల్పించింది. అయితే క్షేత్రస్థాయిలో ధాన్యం ఉందో లేదో తనిఖీ చేస్తామని, దీన్ని బట్టి తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది.

తెలంగాణలో అరాచక పాలన

- బకాయిల కోసం రోడ్డెక్కితే భయపెడతారా?
- మాజీ సర్పంచ్‌లేమైనా దొంగలా?
- అర్ధరాత్రి అరెస్టులెందుకు?: సిరికొండ ఫైర్

శాయంపేట, నవంబర్ 5: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అరాచక పాలన కొనసాగిస్తున్నదని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. మంగళవారం ఆయన హనుమకొండ జిల్లా శాయంపేటలో మీడియాతో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకున్న మాజీ సర్పంచ్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా అణచివేత ధోరణి ప్రదర్శిస్తున్నదని మండిపడ్డారు. ఇంత అరాచక పాలనను తాను ఎప్పుడూ చూడలేదని అన్నారు. లక్షల రూపాయల పెండింగ్ బిల్లులను కూడా చెల్లించలేని స్థితిలో ప్రభుత్వ ఉన్నదా? అని ప్రశ్నించారు. కొందరు కూలి పనులు చేస్తూ బతుకుతున్నారని, అభివృద్ధి పనుల కోసం బంగారం కుదువపెట్టి, స్నేహితుల వద్ద అప్పులు పనులు చేపట్టినట్టు తెలిపారు. బిల్లులు చెల్లించకుంటే వాళ్లు ఎలా బతికేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వందల కోట్ల బకాయిలను బడాబాబులకు చెల్లిస్తూ మాజీ సర్పంచ్‌లకు మొండిచేయి చూపడం దారుణమని ప్రత్యామ్నాయ మార్గాలను చూపకపోగా బకాయిల కోసం రోడ్డెక్కితే రాత్రికి రాత్రే రాష్ట్రంలో ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేశారని మండిపడ్డారు. మాజీ సర్పంచ్‌లకు మద్దతుగా వెళితే మూడు గంటలపాటు తిరుమలగిరి పీఎస్‌లో తమను అరెస్టు చేసి ఉంచారని, ప్రభుత్వం ఈ రకమైన తప్పులు చేయవద్దని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతలుగా ప్రజల పక్షాన పోరాడుతామని చెప్పారు.

ఆరు గ్యారెంటీలు అమలవుతున్నాయా?

- వడ్లు కొంటలేరు.. 500 బోనస్ వస్తలేదు
- ఎమ్మెల్యేల ముందే కాంగ్రెస్ నేతల ఆవేదన

మోహన్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 5(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఎమ్మెల్యేల ముందు సొంత పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ నెల 2న నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో డీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. దీనికి కోమటిరెడ్డి సోదరులు డుమ్మా కొట్టగా.. మిగతా ఎమ్మెల్యేలు డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, డీసీసీ కార్యవర్గం మొత్తం హాజరైంది. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డికి కుడిభుజంగా చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పనితీరుపై విమర్శలు గుప్పించారు. 'ఆరు గ్యారెంటీలు ఇచ్చాం.. అవి ఎలా పోతున్నాయో తెల్వదు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు రాలేదని, గ్యాస్ సిలిండర్ డబ్బులు పడుతలేవని ఇంకొందరు అంటున్నరు. ఏ కార్యకర్తను అడిగినా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా ఆరు గ్యారెంటీలపై చెప్పలేకపోతున్నరు. నాలుగు వేల పెన్షన్ ఎప్పుడు పెంచుతారు? వడ్లకు రూ.500 బోనస్ ఎప్పుడు ఇస్తామో? తెల్వదు. నెల రోజుల నుంచి రైతులు ధాన్యం రోడ్డు మీద పోసుకున్నరు. గతంలో వడ్లు కొంటే పది రోజుల్లోనే.. కాదు.. వారం రోజుల్లోనే డబ్బులు అకౌంట్‌లో పడేవి. ఇప్పుడు చూస్తుంటే బాధ అనిపిస్తున్నది. నల్లగొండ జిల్లాలో ఆరుగురు ఎమ్మెల్యేలు గెలిచారు. మన మంత్రే ఉన్నడు... సివిల్ సప్లయ్ మంత్రిగా.. అయినా వడ్లు కొనకపోవడం బాధ అనిపిస్తున్నది. రైతులు అడిగితే సమాధానం చెప్పలేకపోతున్నం' అంటూ కుండ బద్దలు కొట్టినట్టు మాట్లాడటం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య మాట్లాడుతూ పార్టీలో వివక్ష కొనసాగుతున్నదని, బీసీ, ఎస్టీ, ఎస్సీలకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

ఏవీ ఫిస్టులా సర్జరీల్లో నిమ్స్ రికార్డు

- పది నెలల్లో వెయ్యి శస్త్రచికిత్సలు
- వైద్యులకు డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అభినందనలు

వైద్యులను అభినందిస్తున్న డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, నవంబర్ 5: డయాలసిస్ ప్రక్రియలో కీలకంగా నిర్వహించే ఆర్టీరియో వీనస్ ఫిస్టులా శస్త్రచికిత్సల్లో నిమ్స్ వెయ్యి మార్కును దాటింది. డయాలసిస్ రోగులకు రక్తాన్ని శుద్ధి చేసేందుకు రక్తనాళాల్లో రెండు రకాల నీడిల్స్‌ను ఆర్టీరియో వీనస్ ఫిస్టులా శస్త్రచికిత్స విధానంతో అమర్చుతారు. నిమ్స్ వాస్క్యులర్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సందీప్ మహాపాత్ర నేతృత్వంలో ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు పది నెలల్లో వెయ్యికిపైగా ఆర్టిరియో వీనస్ ఫిస్టులా శస్త్ర చికిత్సలు నిర్వహించి రికార్డు సృష్టించారు. ఇది నిమ్స్ చరిత్రలోనే మొదటిదని వైద్యులు చెబుతున్నారు. ఈ మేరకు మంగళవారం వెయ్యి ఏవీ ఫిస్టులా శస్త్రచికిత్సలు చేసిన వైద్య బృందాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అభినందించారు.

NECC DAY

స్వర్గీయ డా॥ బి.వి. రావు
(1935-1996)

భారత పౌల్ట్రీ పరిశ్రమ పితామహులు
పద్మశ్రీ డా॥ బి.వి. రావు గారి 89వ జయంతి సందర్భంగా
వారికి వందనాలను అర్పిస్తున్నాము.
తమ దార్శనికత, అత్యంత ప్రతిభావ్యుత్పత్తులతో
భారత పౌల్ట్రీ పరిశ్రమను సాంకేతికత ఆలంబనగా
నడిచే ఆధునిక, శాస్త్రీయ పరిశ్రమగా
పునర్నిర్మించిన మహోన్నత వ్యక్తి ఆయన.
పౌల్ట్రీ ప్రపంచంలో భారతదేశాన్ని నెం. 1 దేశంగా
అగ్రభాగాన నిలపాలన్న వారి స్వప్నాన్ని సాకారం
చేయటానికి ఈ సందర్భంగా
మేము పునరంకితమవుతున్నాము.

NECC
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
(Non-Government Public Charitable Trust)

"My Egg, My Price, My Life"